# అపురూప

''లాహిరీ! లే! టైము చూడు ఏడు దాటింది... ఇలా పొద్దుపోయిందాకా పడుకోడం, హడావుడిగా లేచి, తిండి తినకుండా కాలేజీకి వెళ్లడం నీకు బాగా అలవాటైంది... లేచి త్వరగా తెములు... ఇవాళ బ్రేక్‌ఫాస్టు చేయకుండా వెడితే ఊరుకునేది లేదు...'' లాహిరి గదిలోకి వచ్చి, ఆమె కప్పుకున్న దుప్పటి లాగేసి గట్టిగా లేపింది జ్యోతి.

లాహిరి బద్ధకంగా మూలిగింది తిరిగి దుప్పటి మీదకి లాక్కుంటూ ''లేవమన్నానా? మళ్లీ పడుకుంటావేం'' సున్నితంగా విసుక్కుంది జ్యోతి

''నిద్రొస్తోంది మమ్మీ! కాస్సేపు పడుకుంటాను ప్లీజ్'' గారాబంగా గొణిగింది.

కూతురివైపు నిస్సహాయంగా చూసింది జ్యోతి- '' నాక్కూడా టైమవుతోందిరా, పని కావాలి కదమ్మా!''

మదన్ ఆంధ్రా బ్యాంకులో, జ్యోతి సెక్రటేరియట్‌లో పనిచేస్తున్నారు. వాళ్ల ఒక్కగానొక్క కూతురు లాహిరి... బియస్సీ చదువుతోంది.. గారాబాల పట్టి... ఆమె ఆడింది ఆట, పాడింది పాట... చురుకైన పిల్ల కావడంచేత ఒక్కసారి చదవగానే బుర్రలో కంప్యూటరైజ్ అయిపోతుంది. అందుచేత అస్తమానం పుస్తకాల పురుగులా చదువుతూ కూర్చోకుండా, సినిమాలు, షికార్లు తిరుగుతూ, అల్లరి చేస్తూ హాయిగా ఉంటుంది.

లాహిరి అలా బాధ్యతా రహితంగా తిరగడం జ్యోతికి నచ్చదు... చదువుకోకుండా, ఇంట్లో పని, పాటా చూసుకోకుండా అల్లా తిరగవద్దని, కొంచెం భయభక్తులు నేర్పాలని జ్యోతి వాదిస్తుంటుంది... కానీ, మదన్ మాత్రం '' ఈ రోజుల్లో పిల్లలకి మనం చెప్పడం ఏంటి, వాళ్లే మనకి చెప్తారు ఏది మంచి, ఏది చెడు?'' అని అంటాడు.

''లాహిరీ! లేమ్మా'' మరోసారి బతిమాలింది జ్యోతి.

లాహిరి విసుగ్గా దుప్పటి విసిరేసి ''అబ్బా! కాస్సేపు పడుకోనివ్వవేం మమ్మీ!'' అంటూ మంచం మీంచి విసురుగా దిగబోయి తూలిపడింది.. జ్యోతి చటుక్కున పట్టుకుని ''నెమ్మదిగా దిగు పడి పోతావు. నా మీద కోపంతో విసురుగా దిగితే దెబ్బతగిలేది నీకు, నాక్కాదు'' అన్నది.

లాహిరి ఒక్కసారి తల విదిల్చి ''కళ్ళు తిరుగుతున్నాయి మమ్మి, వాంతి అయేలా వుంది'' అన్నది తల చేతుల్లో పట్టుకుని కూర్చుని, ఎందుకు? ఏమైంది?'' ఖంగారుగా లాహిరి తల గుండెలకి అన్చుకుంది జ్యోతి.

''ఏమో! తెలీడంలేదు'' నీరసంగా అన్నది.

'' ఇంట్లో చక్కని టిఫిన్లు, శుభ్రంగా వంట చేస్తే తినకుండా ఆ రోడ్ల మీద బండ్ల దగ్గర నిల్చుని అడ్డమైన గడ్డి తింటావు. వాంతులు అవక ఏం అవుతుంది?'' కోప్పడింది జ్యోతి.

వీళ్లిద్దరి గొడవ విన్న మదన్ వాళ్ల దగ్గరగా వచ్చి లాహిరిని దగ్గరకు తీసుకుని '' ఏం జరిగిందిరా?'' అని అడిగాడు.

''నాకు గిడ్డీనెస్ వస్తోంటే మమ్మీ చూడు డాడీ తిడుతోంది'' గారాబంగా అన్నది.

'' ఏంటి జ్యోతి! తనకి ఆరోగ్యం బాగా లేకపోతే డాక్టరు దగ్గరికి తీసికెళ్లకుండా గొడవ చేస్తావేంటి?''

'హు' జ్యోతి మూతి తిప్పింది ''కాస్త తేనె, నిమ్మరసం తాగితే అన్నీ తగ్గుతాయి ఈ మాత్రానికి డాక్టరెందుకుట?''

''కాదు మమ్మీ ఎలాగో వుంది నాకు'' అంటూనే పరిగెత్తుకుంటూ వాష్ బేసిన్ దగ్గరికి వెళ్లి వాంతి చేసుకుంది.

హఠాత్తుగా కూతురు జబ్బుపడడంతో భార్యా భర్తలిద్దరూ ఖంగారుపడ్డారు. వెంటనే చేతిలో పని ఆపేసి, గబాగబా తయారై జ్యోతి లాహిరిని తీసుకుని ఆటోలో డాక్టరు దగ్గరికి పరిగెత్తింది. డాక్టరు వసుమతి లాహిరిని లోపలికి తీసుకెళ్లి పరీక్ష చేసింది.

'' ఆకలి బాగా వుందా? నిద్ర బాగా పడుతుందా? కడుపునొప్పి వస్తుందా? పీరియడ్స్ రెగ్యులర్‌గా వస్తున్నాయా?'' అంటూ చాలా

ప్రశ్నలేసింది.

లాహిరికి అన్నీ సరిగానే వున్నా, ఈ మధ్య పీరియడ్సు రెగ్యులర్‌గా లేవు.. ''రెణ్ణెల్లయింది డాక్టర్! రెగ్యులర్‌గా లేవు'' చెప్పింది లాహిరి.

''రెండు నెలలా?'' డాక్టర్ మరికొన్ని పరీక్షలు చేసి, చిరునవ్వుతో అన్నది ''కంగ్రాట్స్ అమ్మా! నువ్వు అమ్మ కాబోతున్నావు.''

లాహిరి తెల్లబోయి చూసింది. ''నాన్సెన్స్ తను అమ్మ కావడం ఏమిటి?'' విసుగ్గా చూసింది డాక్టరువైపు, ఆవిడ వాష్ బేసిన్ దగ్గర చేయి కడుక్కొని నాప్‌కిన్‌తో తుడుచుకుంటూ, వచ్చి కుర్చీలో కూర్చుని ప్రిస్క్రిప్షన్ రాస్తూ జ్యోతితో అన్నది. ''మీ అమ్మాయేనా? మీరు అమ్మమ్మ కాబోతున్నారు''.

తన పక్కనే అణుబాంబు పడినట్టు నిర్ఘాంతపోయి చూసింది జ్యోతి.

''వాట్? నేను... లాహిరి''

'' అమ్మ కాబోతోంది''.. ఆవిడ తలవంచుకుని మందులు రాస్తోంది.

లాహిరి స్ట్రెచర్ మీంచి లేచి, తల్లి పక్కన కుర్చీలో కూర్చుంది. ఆ అమ్మాయికంతా అయోమయంగా వుంది. లాహిరి మనస్తత్వం చిన్నపిల్ల మనస్తత్వం, అల్లరి చిన్న పిల్లల అల్లరి, అలాగని చిన్నపిల్ల కాదు, గర్భం ఎలా వస్తుందో తెలియని అమాయకురాలు అసలే కాదు, కానీ, కొన్ని విషయాలు కాదు, చాలా విషయాలు సీరియస్‌గా ఆలోచించకపోవడం ఆమె స్వభావం, అలాంటి వాటిలో పెళ్లికి ముందే సెక్స్...

పెళ్లి కాకుండా జీవితం అనుభవించడం ఆమె దృష్టిలో తప్పుకాదు, అలాగని దానికోసం జీవితం నాశనం చేసుకుంటూ తిరగడం ఆమె అభిమతం కాదు, అవకాశం వచ్చినప్పుడు అనుభవించడంలో తప్పేం లేదు అన్నది ఆమె వాదన... ఆ మధ్య ఓ ప్రముఖ మాసపత్రిక వాళ్లు పెళ్లికి ముందు సెక్సు గురించి యువతీ యువకుల అభిప్రాయాలు సేకరించినప్పుడు తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా, నిర్భయంగా చెప్పింది. అలా చెప్పిందని కానీ, కూతురుకి ఇలాంటి అభిప్రాయాలు వున్నాయన్న సంగతికానీ, ఇటు జ్యోతికీ, అటు మదన్‌కీ కూడా తెలియదు.

అయితే, డాక్టరు చెప్పిన వార్త విన్న తరువాత, ఇలాంటి ఇబ్బందులు వుంటాయన్న సంగతి మొట్టమొదటిగా తెలుసుకున్న లాహిరి అసలిదెలా జరిగింది? అని ఒక్కసారి గతం గుర్తు చేసుకుంది.

ఆ రోజు లాహిరి కాలేజీకి వెళ్లేటప్పటికీ క్లాసులు అవడంలేదు, స్టూడెంట్సు అంతా ఆవరణలో నిల్చుని వున్నారు.. క్లాసులో అల్లరి చేస్తున్నాడని ఓ విద్యార్థిని లెక్చరర్ క్లాసు నుంచి బైటకి పంపించేశాడు... లెక్చరర్‌కి వ్యతిరేకంగా ఆ క్లాసువాళ్లు అందరు కలిసి మొత్తం కాలేజీలో అన్ని క్లాసులు బాయ్‌కాట్‌చేశారు... చేయనివాళ్లని స్టూడెంట్సు యూనియన్ నాయకులొచ్చి దగ్గరుండి చేయించారు.

వెహికల్ పార్క్ చేసి వచ్చిన లాహిరి తన క్లాసుమేట్సు కోసం చూసింది. అమ్మాయిలంతా అప్పటికే వెళ్లిపోయారు. కొందరింకా కాలేజీకే రాలేదు.. వినోద్, వేణు, అజయ్ మరికొంతమంది ఆ లెక్చరర్‌కి వ్యతిరేకంగా నినాదాలిస్తున్నారు. లాహిరిని చూసిన అజయ్ ఆమె దగ్గరిగా నడిచి ''నువ్వు కూడా మాతోపాటు స్ట్రైకు చేస్తావా? ఇంటికి వెళ్లిపోతావా లాహిరీ'' అని అడిగాడు.

''నేను రెండూ చేయను - సినిమాకి వెడతాను.. ఇంతకీ ఏమిటి సంగతి?'' అడిగింది లాహిరి.

''నిన్న బియస్సీ క్లాసులో పవన్ లెక్చరర్‌ని సరదాకి ఏదో నిక్‌నేమ్‌తో పిలిచాట్ట... ఆయన సీరియస్‌గా తీసుకుని వాడిని క్లాసు బైటికి పంపించాడు.''

'' ఓ! ఎవరు బాబూ ఆ లెక్చరర్? కాలేజ్ వాతావరణంకి కొత్త కాబోలు'' నవ్వింది లాహిరి

''ఓకే నేను వెళ్లిపోతాను, నువ్వు కూడా వస్తావా? మనిద్దరం ఎటన్నా వెడదాం'' అడిగింది.

అజయ్ చుట్టూ చూస్తూ, ''నువ్వు పిలిస్తే రాననడానికి మనసు రావడం లేదు, కానీ వాళ్లు చూశారంటే గొడవ చేస్తారు... ఓ పనిచేయి.. నువ్వు ముందు వెళ్లిపో.. నేను ఎవరూ చూడకుండా నిన్ను చౌరస్తా దగ్గర కలుస్తాను. ఓ.కె.''

'' ఓకె.'' అంటూ బైక్ దగ్గరికి నడిచింది లాహిరి... ఆమె వెళ్లిన ఐదు నిముషాలకి ఆమెని అనుసరించాడు.

చౌరస్తా వద్ద అజయ్ కోసం చూస్తున్న లాహిరి అతడ్ని చూడగానే '' ఎక్కడికి వెడదాం..?'' అడిగింది.

''మార్నింగ్ షోకి వెడదామా?'' అడిగాడు.

'' ఓకె!'' రెండు వెహికల్స్ సంగీత్‌వైపు బయలుదేరాయి.

ఇంగ్లీషు సినిమా మార్నింగ్ షో చూసి బైటికి వచ్చాక అన్నది లాహిరి '' అజయ్ మా ఇంటికి వెళ్దామా?''

' ఓకె'

రెండు వెహికల్స్ పద్మారావునగర్ వైపు బయలుదేరాయి.

ఇంట్లోకి వెళ్లగానే సోఫాలో వాలిపోయి ''అబ్బా తలనొప్పి వచ్చింది... బాగా చిరాగ్గా వుంది... అజయ్! నువ్వు టివి చూస్తుండు నేను స్నానం చేసి వస్తాను'' అంటూ లోపలికి వెళ్లిపోయింది లాహిరి.

అజయ్ టివి ఆన్ చేశాడు... తెలుగు చానెల్‌లో సినిమా క్లిప్పింగులు చూపిస్తున్నారు.

అజయ్ చానెల్ మార్చాడు స్టార్ మూవీ వస్తోంది.. అలర్ట్ అయి కూర్చున్నాడు.. కొన్ని నిముషాల్లోనే సర్వం మర్చిపోయి సినిమా చూస్తున్న అజయ్ మోహం మీద చిటికెలు వేస్తూ ''హలో!'' అన్నది లాహిరి.

అజయ్ ఉలిక్కిపడి ఆమెవైపు చూశాడు. లాహిరి స్నానం చేసి నైటీ వేసుకుని వచ్చింది.. జుట్టు క్లిప్పు తీసేసి విరబోసుకుంది. ఆమె చల్లుకున్న బాడీ స్ప్రే మంచి పరిమళాలు వెదజల్లుతోంది.

అజయ్ కళ్ల ముందు టివీలో ముద్దు సీన్లు, హీరో, హీరోయిన్ల క్లోజప్ సీన్లు రకరకాల శృంగార భంగిమలు కదిలాయి.. తనకు అతి సమీపంలో కూర్చొని నవ్వుతోన్న ఆమెని చూస్తుంటే అణువణువూ కోరికతో రగిలిపోయింది. '' ఏంటి అలా చూస్తున్నావు?'' అడిగింది.

''యూ ఆర్ సింప్లీ బ్యూటిఫుల్'' అన్నాడు అదోరకంగా చూస్తూ, ఆ చూపుల్లో కనిపించిన మత్తుకి, అతని స్వరంలో వినిపించిన గమత్తుకి, కళ్లల్లో కొత్తగా కనిపిస్తున్న కాంక్షకి లాహిరి మనసు చిత్రంగా స్పందించింది. శరీరంలోంచి ఆవిర్లు వస్తున్నట్లనిపించింది అప్రయత్నంగా అతనికి దగ్గరగా జరిగింది.

ఆ క్షణం చాలు అజయ్‌కి... చటుక్కున దగ్గరికి లాక్కుని గట్టిగా పెదాలు ముద్దు పెట్టుకున్నాడు.

ఎప్పుడు అజయ్ తనని ఎత్తుకున్నాడో బెడ్‌రూమ్‌లోకి ఎప్పుడు తీసుకొచ్చాడో తెలీలేదామెకి.

లాహిరి ఒక్కసారిగా ఆలోచనల్లోంచి తెప్పరిల్లింది.

డాక్టరు వసుమతి ప్రిస్క్రిప్షన్ జ్యోతి చేతికిస్తూ అన్నది ''ఈ మందులు వాడండి... అమ్మాయి చాలా వీక్‌గా వుంది బాగా తినాలి.''

జ్యోతి శిలావిగ్రహంలా కూర్చుండిపోయింది. డాక్టర్ చెప్పినమాట ఆమె చెవుల్లో ప్రతిధ్వనిస్తూ, మెదడు నరాలని చిట్లగొడుతున్నట్టుగా అనిపించసాగింది... లాహిరి.. ఇరవై ఏళ్ళు కూడా నిండని లాహిరి, భవిష్యత్తులో పెద్ద సైంటిస్టు అవాలని కలలు కంటోన్న కూతురు పెళ్లి కాకుండా... నో! జ్యోతి తల విదిల్చింది.

''ఏమ్మా మీ అమ్మాయి సరిగా తినదా'' అడిగింది డాక్టరు.

లాహిరికి అన్నం తినడం, ఇడ్లీ, దోసెలు తినడం అంటె చిరాకు. ఆకలేస్తే క్యాడ్‌బరీ చాక్లెట్లు తినేస్తుంటుంది ''అదేవిటే'' అంటే '' ఇన్‌స్టంట్ ఎనర్జీ ఇస్తుంది మమ్మీ'' అంటుంది. రోడ్డుమీద చాట్ బండ్లు దగ్గర స్నేహితులతో నిలబడి పానీపూరీలు, రగడాలు తినేస్తుంటుంది... లేకపోతే బేకరీలో చేరి పేస్ట్రీలు, సమోసాలు, కరిపఫ్‌లు ఇలా ఆమె ఆహారపు అలవాట్లు కూడా పూర్తిగా మోడరన్.. ఏం తిన్నా ఏం తాగినా వేళకి కొంచెం పెరుగన్నం తినాలని జ్యోతి ఎన్నిసార్లు తిట్టినా కేర్‌నాట్‌గా ఉంటుంది.

జ్యోతి అప్రయత్నంగా తల ఊపింది.

'' ఏవమ్మా! అన్నం తినకుండా ఏం తింటావు? పానీపూరీలు, పావ్‌బాజీలా? ఈ కాలం అమ్మాయిలకి జీవితమే కాదండీ, తిండి కూడా ఫాస్టుగానే వుండాలి.. అందుకే ఫాస్టు ఫుడ్సు తింటుంటారు'' నవ్వింది డాక్టరు.

లాహిరిగానీ, జ్యోతిగానీ ఆవిడ జోకులు ఆస్వాదించే స్థితిలో లేరు. ఎవరి ఆలోచనలో వాళ్లున్నారు.

డాక్టరు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ తీసుకుని, ఆవిడకి ఫీజు ఇచ్చి

బైటపడ్డారిద్దరూ... జ్యోతి సర్వం పోగొట్టుకున్నదానిలా కళ్లల్లో నీళ్ళు తిరుగుతోంటే, మాటిమాటికి కళ్లు తుడుచుకుంటూ మౌనంగా కూర్చుంది ఆటోలో.

లాహిరికి చిరాగ్గా అనిపిస్తోంది.. కానీ జ్యోతిలా బాధపడడంలేదు ఏం జరిగిందని? అమ్మ ఏడవడం అనుకుంటోంది.

తనకు మాత్రం తెలుసా ఇలా జరుగుతుందని... ఛ, ఛ తనకి బుద్ధి లేకపోతే అజయ్‌కన్నా వుండాలి.. ప్రెగ్నెన్సీ రాకుండా బోలెడన్ని ప్రికాషన్స్ అందుబాటులో వున్నాయి కదా! అయినా ఆ సమయంలో ఇవన్నీ ఆలోచిస్తారేంటీ?

ఆ క్షణంలో అజయ్ తనని ముట్టుకోగానే తన శరీరంలో కరెంట్ ప్రవహిస్తున్నట్టు అనిపించింది. ఆ అనుభూతి ఎంతో మధురంగా, హాయిగా అనిపించింది... అంతే! ఎంజాయ్ చేయాలనిపించింది.

అయినా ఒక్కసారికే కడుపొస్తుందా? ఎలా? ఛ ఈ ప్రెగ్నెన్సీ బాధ లేకపోతే ఇప్పుడు మాత్రం ఏం పోయిందిలే అబార్షన్ చేయించేసుకుంటే సరి.

ఆటో గేటు ముందు ఆగింది.. జ్యోతి చటుక్కున దిగి చేతిలో పట్టుకున్న డబ్బులు డ్రైవరు చేతిలో పెట్టి పరుగులాంటి నడకతో లోపలికి వెళ్లిపోయింది.

లాహిరి కూడా దిగి, నెమ్మదిగా నడిచి హాల్లోకి వెళ్లి సోఫాలో కూర్చుని, కాళ్లు టీపాయ్ మీదకి చాచుకుంది.

జ్యోతి పది నిమిషాల తర్వాత ఎర్రబడ్డ కళ్లతో చివ్వున వచ్చి లాహిరి రెక్క పుచ్చుకుని బరబరా బెడ్‌రూమ్‌లోకి లాక్కెళ్లి గట్టిగా అడిగింది.

''వాడెవరో చెప్పవే మేము వెళ్లి మాట్లాడి ముహూర్తం పెట్టిస్తాము''

'' ఎవరు? ముహుర్తం ఏంటి? ఆశ్చర్యంగా చూసింది లాహిరి.

'' ఎవరా? నీకు.. నీకసలు భయం, బాధ, దిగులు ఏమి లేదా? నేనడిగిందాకా వాడెవరో చెప్పవా?'' కూతురి వాలకం చూసి విస్తుబోతూ అడిగింది జ్యోతి.

''మమ్మీ! అజయ్ నేను అనుకోకుండా ఓ రోజు టెంప్టు అయ్యాము. ఎంజాయ్ చేశాము నాకేం తెలుసు ఇలా జరుగుతుందని''

జ్యోతి తెల్లపోయి చూసింది.. ఎంత తేలిగ్గా చెబుతోంది ఎంజయ్ చేసిందట... చాట్‌భండార్‌లో కూర్చుని పానీపూరీ తినడమా? లేక ఏసి హాల్లో కూర్చుని సినిమా చూడటమా? ఎంజాయ్ చేసిందట... ఇదంతా తను చేసిన గారాబం ఫలితమా? మదన్ ఇచ్చిన అతి చనువా? లేక... స్వేచ్ఛ పేరుతో ఈ తరం అమ్మాయిలు వేసే వేలం వెర్రి వేషాలా?

''బుద్ధిలేకుండా మాట్లాడకు- వాడిపేరు, అడ్రసు చెప్పు నిన్ను కన్న పాపానికి మేము వెళ్లి వాళ్ల కాళ్లు పట్టుకుని బతిమాలుకుంటాం ఆ మూడు ముళ్లు వేయిస్తాం''.

''నాన్సెన్స్'' కోపంగా అరిచింది లాహిరి '' ఏంటి అజయ్‌తో నా పెళ్లి జరిపిస్తారా? చస్తే చేసుకోను''

నిర్ఘాంతపోయింది జ్యోతి. ' ఏంటి అజయ్‌ని పెళ్లి చేసుకోవా? మరి...''

''చేసుకోను అజయ్‌ని పెళ్లిచేసుకోడం ఏంటి మమ్మీ అజయ్ నా బాయ్‌ఫ్రెండ్ తనని నేనెప్పుడు భర్తగా భావించలేదు. నాకు పెళ్లి మీద చాలా కోరికలున్నాయి.''

జ్యోతి నోట మాటరానిదానిలా చూస్తుండిపోయింది. అజయ్‌తో తొందరపడి, కడుపుతెచ్చుకుని ఏ ధైర్యంతో అతన్ని చేసుకోనంటోంది ఇది, పైగా పెళ్లి మీద చాలా కోరికలున్నాయి అని ఎంత నిర్భయంగా చెబుతోంది! దీన్ని ధైర్యం అనాలా? తెగింపు అనాలా? అమాయకత్వం అనాలా? జ్యోతికి తన చిన్నప్పుడు పక్కింటి సుజాత కాలుజారి కడుపొచ్చిందని ఆత్మహత్య చేసుకోవడం గుర్తొచ్చింది. ఇదేంటి లాహిరి ఇలా మాట్లాడుతోంది తన కూతురు తప్పు చేసింది... అమాయకత్వంతో టో, తెలివితక్కువతో టో కూతుర్రు చేసిన తప్పుని కడుపులో దాచుకుని, క్షమించి, కూతురి భవిష్యత్తు నిలబెట్టటం... తల్లిగా తన బాధ్యత... జరిగిన సంఘటన తల్చుకుంటూ, కూతురిని తిడుతూ, దురదృష్టం అనీ ఖర్మ అనీ నెత్తిన చేతులు పెట్టుకు కూర్చుంటే లాహిరి జీవితం నాశనమైపోతుంది... రభస చేసి తమ వ్యక్తిగత విషయాలని తామే వీధిన పడేసుకున్నందువలన వొరిగేదేంటి? అతనెవరో తెలుసుకుని, కులం గోత్రం, వంశం, ఆస్తి అంతస్తు ఏమీ చూడకుండా అతనికిచ్చి పెళ్లి చేయడం తక్షణ కర్తవ్యం. కానీ ఇదేంటి ఇలా అంటోంది... జ్యోతికి ఏం చేయాలో తోచలేదు.

మదన్ ఆఫీసు నుంచి ఫోన్‌చేసి ''డాక్టర్ ఏమన్నారు? ఏంటి సంగతి? అని అడిగితే నువ్వు సాయంత్రం ఇంటికి త్వరగా వచ్చేసెయ్, నేను ఆఫీసుకి వెళ్లడంలేదు'' అని చెప్పింది జ్యోతి. లాహిరి మామూలుగా తిరుగుతోంటే పిచ్చిదానిలా చూస్తూ అలా కూర్చుండిపోయింది మదన్ ఇంటికి వచ్చిందాకా...

సాయంత్రం ఇంటికి వచ్చిన మదన్ జ్యోతి చెప్పినదంతా విని షాకు తగిలినట్టయిపోయాడు. లాహిరి ఇలాంటి పనిచేసిందా? తన కూతురు అమాయకురాలు అనుకుంటోన్న తన గారాబాల కూతురు ఇంత పెద్దదైపోయిందా? అతనికేం అంటుబట్టలేదు, మిగతా విషయాలు మాట్లాడినట్టు కూతురితో ఈ విషయం మాట్లాడలేకపోయాడు. లాహిరి వచ్చి పలకరించినా మొహం తిప్పుకుని వెళ్లిపోయాడు. జ్యోతికే నిర్ణయం వదిలేశాడు. అజయ్‌ని లాహిరి ప్రేమించిందేమో అనుకున్న మదన్ ప్రేమించిన వాడితో పెళ్లి వద్దంటే లాహిరి ఏ అఘాయిత్యం చేస్తుందోనని భయపడ్డాడు. కానీ లాహిరి చెప్పిన సమాధానాలు అతనికి మతిపోయేలా చేశాయి.

తల్లీ, తండ్రి ప్రవర్తన లాహిరికి నచ్చలేదు. తనేం చేసిందని ఇలా ప్రవర్తిస్తున్నారు వీళ్లిద్దరూ, అబార్షన్ చేయించుకుంటే పోయేదిగా. ఎందుకిలా ఏడుస్తున్నారు వీళ్లిద్దరు... దాదాపు మూడు నెలల క్రితం తన క్లాసుమేటు సుజిత అనే అమ్మాయి మరో క్లాసుమేట్‌ని ప్రేమించి ప్రెగ్నెన్సీ వచ్చాక అతను పెళ్లి చేసుకోనన్నాడని ఆత్మహత్య చేసుకుంది... ఆ తరువాత వాళ్ల అమ్మవాళ్ళు పరువుపోయిందని ఈ ఊరు వదిలిపెట్టి వెళ్లిపోయారు. తనేం అలా చేయడంలేదే!

రెండురోజులు గడిచాక లాహిరి జ్యోతితో అన్నది– ''మమ్మీ రేపు నేను డాక్టర్ దగ్గరికి వెళ్లి అబార్షన్ చేయించుకుంటాను. మళ్లీ రెండురోజుల్లో కాలేజీకి వెళ్లవచ్చు... అనవరంగా శోకాలు పెట్టి గలభాచేసి, గోలచేసి చిన్న విషయాన్ని పెద్దగా చేయకు... ఈ విషయం ఎలా డీల్ చేయాలో నాకు తెలుసు... అజయ్‌తో నా పెళ్లి గురించి అసలు ఆలోచించకండి...

జ్యోతి వెర్రిచూపులు చూస్తోంటే హైహీల్స్ టకటక లాడిస్తూ బైటికి వెళ్లిపోయింది. లాహిరి వెళ్లిన వైపు చూస్తూ చేష్టలుడిగి కూర్చుండిపోయింది జ్యోతి... లాహిరి మాట్లాడిన ప్రతి అక్షరం ఒక్కో పుల్లగా మారి ఆవిడ గుండెల్లో చితి పేరుస్తున్నట్లు, దాని తాలూకు సెగతో ఒళ్లంతా ఆవిర్లు

సోకుతున్నట్టుంది. మదన్ ఎలాగైనా కూతుర్ని పెళ్లికి ఒప్పించమని చెప్పాడు. ఇప్పుడేం చేయాలి? మదన్ వచ్చిందాకా అలాగే కూర్చుండిపోయింది. మదన్ ఆమెని చూసి కదిలిపోయాడు. రెండురోజులకే కృశించి, కళతప్పి ఉంది జ్యోతి. ఆమెని దగ్గరికి తీసుకుని ప్రేమగా అడిగాడు. '' ఏం జరిగింది? లాహిరి ఏమంది?

ఆ అప్యాయతకి చలించిపోతూ అతని ఒళ్లో వాలిపోయి వెక్కివెక్కి ఏడవసాగింది జ్యోతి.

''అది- అది అతడిని పెళ్లి చేసుకోదుట... ఎంజాయ్ చేసిందట... అబార్షన్ చేయించుకుంటుందిట'' ఒక్కో అక్షరం కూడదీసుకుంటూ ఆమె చెప్తోన్న మాటలు వింటోంటే మదన్‌కి కాస్సేపు తనేం వింటున్నాడో ఏం అర్థం కాలేదు... అర్థమయ్యాక అతనికి మతిపోయినట్టయింది. లాహిరి ఇంతగా అడ్వాన్స్ అయిందా? ఇలాగా తెగించిందా? దీన్ని తెగింపు అనాలా? మితిమీరిన స్వేచ్ఛ అనాలా? ఆడపిల్ల కోరుకునే స్వేచ్ఛ ఇదేనా? చదువుకోడానికి, తిరగడానికి, మాట్లాడటానికి, నవ్వడానికి, కదలడానికి, మెదలడానికి ఉద్యోగం చేయడానికి, పెళ్లికి, పిల్లల్ని కనడానికి మాకు స్వేచ్ఛ వుండకూడదా? మా హక్కుల్ని ఎందుకు కాలరాస్తున్నారు? అని గొంతెత్తి సభల్లో అరిచి సంపాదించుకున్న స్వేచ్ఛ పరిణామమా ఇదంతా?

''మదన్! నా మాట వినడం లేదు... నువ్వన్నా చెప్పు'' దీనంగా అన్నది జ్యోతి.

మదన్ నిట్టూర్చాడు- ''తల్లిగా నువ్వు సాధించలేనిది, తండ్రిగా నేను సాధించగలనా? కానీ... ఎలా జరిగితే అలాగే జరుగుతుంది రేపు డాక్టర్ దగ్గరికి వెళ్ళి జరిగింది చెప్పి ఆ కాస్త తీయించేసి తీసుకురా... మళ్లీ కన్నెపిల్లగా మారాకా దానికి నచ్చినవాడిని వెదికి కన్యాదానం చేద్దాం'' స్వరం వణికింది.

అయితే వాళ్ళనుకున్నట్టుగా డాక్టర్ దగ్గర పని సులభం అవలేదు. అందుకు కారణం లాహిరి చాలా బలహీనంగా ఉండడం. అప్పటికే మూడో నెల దాటడం.

జ్యోతి నవనాడులూ కృంగిపోయాయి

భార్యాభర్తలిద్దరూ రెండురోజులపాటు చేష్టలుడిగిపోయి, నిస్పత్తుగా

వుండిపోయారు మనసులో కుమిలిపోతూ... ఇద్దరూ కలిసి లాహిరికి నచ్చచెప్పటానికి ప్రయత్నించారు, తిట్టారు కానీ లాహిరి ఎట్టి పరిస్థితిల్లోనూ అజయ్‌తో పెళ్లికి అంగీకరించనని చెప్పేసింది. ''ఏడో నెలరాగానే సిజేరియన్ చేసి పిల్లని బైటికి తీసేస్తారు... అలా చేద్దాం'' అన్నది లాహిరి.

వాళ్లిద్దరికీ నోట మాటరాలేదు.. ఇలాంటి విషయాలన్నీ ఈ పిల్లకెలా తెలిసాయి? ఈ కాలం పిల్లలంతా పెళ్లికి ముందు సెక్స్ అనుభవిస్తే తప్పేంటి అని అడుగుతున్నారు... లాహిరి కూడా ఇదే భావాలతో వుందా? ఇంత కాలం నుంచీ ఈ అమ్మాయిని అర్థం చేసుకోలేకపోవడం తమ అసమర్థతా? వాళ్లకేం అర్థం కాలేదు.

మదన్ బెంగుళూరులో వుంటున్న తన చెల్లెలు స్వాతికి ఫోన్ చేసి లాహిరి గురించి చెప్పాడు.

అంతా విన్న స్వాతి తేలిగ్గా అన్నది. ''నువ్వేం వర్రీ అవకన్నయ్యా, అస్ట్రాల్ లైఫ్... ఇలాంటివన్నీ మామూలు, వారిజ కూడా ఇలాంటి పనే చేసింది... కాకపోతే అదే తనంతట తను వెళ్లి అబార్షన్ చేయించుకుని ఇంటికి వచ్చింది.. ఒక్కరోజు రెస్టు తీసుకుని మర్నాడు కాలేజీకి వెళ్లిపోయింది. వీళ్లేం గవర్నమెంటు ఉద్యోగులు కాదుగా నలభై ఐదు రోజులు లీవు వుందని వాడుకోవడానికి. నెలాఖరికి పరీక్షలవగానే నా దగ్గరికి పంపించు. ఓసారే డెలివరీ అయాక మళ్లీ అక్కడికి పంపిస్తాను. ఆ తరువాత మామూలుగా కాలేజీకి వెడుతుంది... ఎలాగా ఫైనల్ ఇయర్ కాబట్టి చదువేం డిస్టర్బ్ అవదులే...

''కానీ, బేబీనేం చేయాలి?'' అడిగాడు మదన్ నిస్సహాయంగా

స్వాతి నవ్వింది ''నువ్వింకా ఏ లోకంలో వున్నావన్నయ్యా? బోలెడన్ని అనాథ శరణాలయాలున్నాయి''.

మదన్ మనసు చివుక్కుమంది... స్వేచ్ఛ పేరుతో వీళ్లిలా తిరగడం దేశంలో అనాథలను తయారు చేయడానికా? నిట్టూర్చాడు.

''అన్నయ్యా! ఈ కాలంలో సెంటిమెంటల్‌గా ఆలోచించి బాగుపడడం కష్టం... మనం కూడా కాలానుగుణంగా మారితేనే బతకగలం... ఈ విషయంలోనువ్వు చాలా బాధపడుతున్నట్టనిపిస్తోంది... అనవసరంగా

ఎక్కువగా ఆలోచించకు... నేను చూసుకుంటాను ఓకే...''

స్వాతితో మాట్లాడిన దగ్గర్నించీ మదన్ మనసులో సంఘర్షణ మొదలైంది. అప్పుడప్పుడూ పేపర్లలో పసికందులను చెత్తకుప్పల్లో, మురుగు కాలవల్లో, పడేసి వెళ్లిపోతుండే పెళ్లికాని తల్లుల గురించి చదివినప్పుడు ఆ తల్లులమీద తనకి విపరీతమైన అసహ్యం వేస్తుంటుంది.. ఒళ్లూ పై తెలీకుండా తిరిగి వాళ్ల కోరికలకి, వాళ్ల పిరికితనానికి పసిపిల్లల్ని బలిచేయడం ఎంత అమానుషత్వం, తిరగడానికి ధైర్యం చేసేవాళ్లు, పిల్లల్ని పెంచుకోడానికి ఎందుకు ధైర్యం చేయరు? అనుకునేవాడు... కానీ ఇప్పుడు తనకే అలాంటి పరిస్థితి ఎదురైంది... తన తక్షణ కర్తవ్యం ఏమిటో అతనికేం అర్థం కాలేదు... జ్యోతి మాత్రం స్వాతి ఇచ్చిన మోరల్ సపోర్ట్‌తో చాలా ధైర్యంగా, కనిపించింది. ఆమె గుండెలమీద అప్పటిదాకా వున్న భారం తొలిగిపోయి హాయిగా నిట్టూర్చింది. లాహిరి పరీక్షలు అయిపోగానే ఆమెని తీసుకుని భార్యాభర్తలిద్దరూ బెంగుళూరు వెళ్లారు... స్వాతి వీళ్లనెంతో ఆప్యాయంగా ఆహ్వానించింది... ఆమె భర్త వినోద్ కూడా మదన్‌కి, జ్యోతికి ధైర్యం చెప్పాడు.

''మీరేం బాధపడకండి బావగారూ! ఈ రోజుల్లో ఇవన్నీ మామూలై పోయాయి. ఇంకా నయం లాహిరి చేసిన తప్పు ఒప్పుకుంది. ధైర్యంగా నిలబడింది... కొందరు అమ్మాయిలు తిరిగినంతసేపూ తిరుగుతారు. ఇలాంటి పరిస్థితి రాగానే ఆత్మహత్యలు చేసుకుంటారు. లాహిరిని ఈ విషయంలో మనం మెచ్చుకోవాలి.''

''అది కాదు వినోద్ ఆ కుర్రాడెవరో చెబితే పెళ్లి చేసేస్తాం కదా! మనకేం ఆస్తిపాస్తులకేం లోటులేదు... వాళ్లడిగిన కట్నం ఇచ్చి మూడు ముళ్లు వేయిస్తే గౌరవం కదా ఎంత నచ్చచెప్పినా వినదేం'' ఆవేదనగా అన్నాడు మదన్.

''బావగారూ! చదువుకున్న మీరే. ఇలా మాట్లాడితే ఎట్లా? అతనంటే ఇష్టం ఉండి లాహిరి ఈ పనిచేసిందా? ఏదో క్షణికోద్రేకంతో చేసింది. ఖర్మగాలి ఇలా జరిగింది... తొమ్మిది నెలలు కష్టపడి ఆ పిండాన్ని తీసేసి, పాపప్రక్షాళన చేసుకుని, కోరుకున్నవాడిని పెళ్లి చేసుకుని నూరేళ్లూ హాయిగా బతకడం కావాలా మీకు, ఈ తొమ్మిది నెలల కష్టం కోసం మనసు చంపుకుని ఇష్టం లేనివాడిని పెళ్లిచేసుకుని నూరేళ్లూ నరకం చూస్తూ బతకాలా? లాహిరి ఆధునిక యువతి బావగారూ! ఆమెకేం కావాలో ఆమెకి తెలుసు... మీరింక

ఈ విషయం మర్చిపోయి హాయిగా ఎంజాయ్ చేయండి. రేపు ఉదయం అందరం మైసూరు వెళదాం సరదాగా సరేనా!''

అతని మాటలకి, ఆ విశాల హృదయానికి మదన్ కళ్లు కృతజ్ఞతతో చెమర్చాయి.

నాలుగురోజులు స్వాతి కుటుంబంతో సరదాగా గడిపి జ్యోతి, మదన్ హైదరాబాద్ ప్రయాణమయ్యారు. బయలుదేరేటపుడు కూతుర్ని దగ్గరికి తీసుకుని కన్నీళ్లతో ముద్దు పెట్టుకుంది జ్యోతి... లాహిరి మాత్రం ఎప్పటిలాగే హుషారుగా తిరుగుతోంది... కాకపోతే మధ్య ''అబ్బ బరువుగా వుంది మమ్మీ... వెయిట్ పెరిగినట్టుగా అనిపిస్తోంది.. డైటింగ్ చేస్తాను'' అని గోలచేస్తోంది.

జ్యోతికి భాధనిపించింది... ఈ హైటెక్ పిల్లలకి జీవితం అంటే ఏమిటో తెలియక చేసే తప్పులే కాని అవి జీవితంపట్ల అవగాహనతో చేసేవి కాదుగా... నిజంగా జీవితం అంటే ఏమిటో తెలిసిన వాళ్ల ఇలాంటి అవివేకపు స్వేచ్ఛ కోరుకుంటారా? ఆ మధ్య ఎక్కడో చదివింది ఎవరో ఒకమ్మాయి గర్భం దాలిస్తే ఎలా ఉంటుందో అనే థ్రిల్‌కోసం పెళ్లికాకుండా పిల్లని కని, కన్నాక ఆ పిల్లని ఏంచేయాలో తెలియక ముక్కు మూసి చంపేసిందట... జ్యోతి ఒళ్లు ఒక్కసారి గగుర్పొడిచింది.

లాహిరికి నెలలునిండాయి.

స్వాతి ఎప్పటికప్పుడు మదన్‌కి, జ్యోతికి ఫోన్ చేసి అన్ని విషయాలు చెప్తోంది. కడుపులో శిశువు కదిలినప్పుడల్లా లాహిరి చిన్నపిల్లలా సంబరపడుతోందని ''అత్తా! బేబీ ఎప్పుడు బైటికి వస్తుంది?'' అని అడుగుతోందని స్వాతి చెప్పడంతో జ్యోతి బిగ్గరగా ఏడ్చింది... మదన్ ఆమెని అక్కున చేర్చుకుని ఓదార్చాడు.

ఏడో నెలరాగానే సిజేరియన్ చేసి బేబీని బైటకి తీసి పడేయమని గోల చేసింది లాహిరి... కానీ స్వాతికలా ఇష్టం లేదు ఏడో నెలలో బేబీ సరిగా ఎదగకపోయినా, బలహీనంగా వున్నా బతకడం కష్టం అంటారు. ''బేబిని ఎవరికన్నా ఇచ్చేద్దాం కానీ చంపే హక్కు మనకి లేదు. ఇన్నాళ్లు భరించావు... ఇంకా రెండు నెలలు భరించు'' అని నచ్చచెప్పింది.

అయితే, లాహిరి ముందు గొడవ చేసినా నెలలు నిండుతున్నకొద్దీ కడుపులో సున్నితమైన పాపాయి కదలికలకి ఆమెలో చిత్రమైన మార్పొచ్చింది.. ''అత్తా! పాప పుట్టాక నాకోసారి చూపించి ఎవరికైనా ఇవ్వు.. పుట్టగానే పాపాయి ఎలా వుంటుందో చూడాలని వుంది'' అన్నది.

లాహిరిలో వున్న అమాయకత్వం చూస్తే స్వాతికి జాలేసింది.

తొమ్మిదో నెల వచ్చింది... ఆరోజు తెల్లవారి లేస్తూనే లాహిరికి నొప్పులు ప్రారంభమయ్యాయి.

వినోద్, స్వాతి కలిసి హాస్పిటల్‌కి తీసుకెళ్లారు.. సరిగ్గా ఆస్పత్రికి తీసుకెళ్లిన రెండు గంటల తర్వాత లాహిరికి డెలివరీ అయి గులాబీ పూవులాంటి పాప పుట్టింది.. నర్సు చేతుల్లో చిన్న చిన్న గుప్పిట్లు మూసుకుని, ఇంకా కళ్లు తెరవని ఆ పసిగుడ్డుని చూస్తోంటే లాహిరికి అప్పుడే పూసిన ఓ గులాబీ పూవు గుర్తొచ్చింది.

స్వాతి ఏం మాట్లాడిందో గానీ పాపని తీసుకుని నర్సు వెళ్లిపోయింది. లాహిరికి పాపని నర్సు తీసుకెళ్లిపోవడం నచ్చలేదు, ఇంకాస్సేపు పాపని చూడాలనిపించింది. ఒక్కసారి చేత్తో ముట్టుకోవాలని, ఎత్తుకోవాలని అనిపించింది...

రూములోకి తీసుకురాగానే స్వాతితో అన్నది- ''పాపనిచ్చేశావా? కొన్నిరోజులుంచుకుని ఇచ్చేద్దామా'' స్వాతి విచిత్రంగా చూసిందాపిల్ల వైపు ''కొన్ని రోజులుంచుకుని ఎలా ఇవ్వగలవు లాహిరి? అయినా అయిందేదో అయింది, నువ్వీ క్షణం మంచి మామూలు లాహిరివి... అంతా మర్చిపోయి హాయిగా నెలరోజుల్లో కాలేజీలో చేరి పై చదువులు చదువుకో, మంచి సంబంధం చూసి నాన్న చేసే పెళ్లిచేసుకుని సుఖపడు''.

లాహిరికి స్వాతి చెప్పింది నిజమే అనిపించినా ఎందుకోగాని, మనసులో తనేదో తప్పు చేసినట్టుగా గిల్టీగా అనిపించసాగింది.

''అత్తా! పోనీ వాళ్లతో చెప్పు పాపకి అపురూప అని పేరుపెట్టమని. నాకా పేరంటే చాలా ఇష్టం. నాకు పాప పుడితే అదే పేరుపెట్టాలనుకున్నాను''

స్వాతికి లాహిరి మాటలు బాధ కలిగించాయి. ఇది తెలివైన పిల్లా? తెలివితక్కువదా? అనుకుంది. చిరునవ్వుతో ''సరే చెబుతాను,'' అనేసి ఊరుకుంది.

జ్యోతికీ, మదన్‌కీ స్వాతి జరిగిందంతా ఫోన్‌చేసి చెప్పింది.. వాళ్లిద్దరూ తేలిగ్గా నిట్టూర్చారు. ఒక్క క్షణం ఓ చిన్నారి పాపాయి జీవితం నాశనం చేశామేమో అనిపించింది ఇద్దరికీ... పాపం పాపనెవరు తీసుకెళ్లారో, ఎలా చూసుకుంటారో! భగవండి దయవలన మంచి కుటుంబంలోకి వెళ్లి ఆ పాప భవిష్యత్తు ఉజ్వలంగా వెలగాలి... అనుకున్నారిద్దరూ, నెల తరువాత లాహిరి తిరిగి హైదరాబాద్ వచ్చి, కాలేజీలో చేరింది. జరిగిన విషయం ఎవరికీ పొరపాటున కూడా చెప్పలేదు... సెలవుల్లో ఊరెళ్లి వచ్చిందనుకున్నారే గాని ఎవరూ ప్రత్యేకంగా లాహిరినిగానీ, జ్యోతిని కానీ ఏమీ అడగలేదు.

జ్యోతి లాహిరిని కూర్చోబెట్టి ఓరోజు ఖచ్చితంగా చెప్పింది... ఇంకోసారి అలాంటి తిరుగుళ్లు తిరిగితే ఇంట్లోంచి వెళ్లగొడతాం అని... కొంచెం బెదిరింది లాహిరి... అంతేగాక ''అజయ్‌తో ఈ విషయం చెప్పకు... రేపెప్పుడైనా అడ్వాంటేజ్‌గా తీసుకుంటాడు.. ఏం జరగనట్టు వుండు. ఇంకోసారి వాడితో వంటరిగా కనిపిస్తే మాత్రం బాగుండదు'' అని వార్నింగ్ కూడా ఇచ్చింది జ్యోతి.

లాహిరిలో మునుపటి చిలిపితనం, నిర్లక్ష్యం పోయి కొద్దిగా హుందాతనం వచ్చింది. అది బహుశా పొందిన చేదు అనుభవంవలన కావచ్చు, లేక వయస్సు తెస్తున్న మార్పు కావచ్చు, ఇదివరకులా ఛాట్‌భండార్‌లలో కాకుండా ఇంట్లోనే అన్నం తింటోంది.

మధ్య, మధ్య తెల్లటి టవల్ మధ్య గులాబీ పూవులాంటి పాప కళ్ల ముందు కనిపిస్తూంటే పాప ఎక్కడుందో! ఏం చేస్తుందో! అనుకోసాగింది.. ఓ రోజు స్వాతికి ఫోన్‌చేసి ''అత్తా! పాపని ఎవరు తీసుకున్నారు? ఏం పేరు పెట్టారు? అపురూప అని పెట్టమన్నానని చెప్పావా?'' అనడిగింది.

అది విన్న జ్యోతి మండిపడింది. '' వెధవపని చేసేటప్పుడు లేని ప్రేమ, శ్రద్ధ ఇపుడు కావాల్సి వచ్చాయా? ఎన్నిసార్లు చెప్పాను ఇంక ఆ విషయం ఆలోచించవద్దని...''

తల్లిని అంత కోపంగా మొదటిసారి చూసిన లాహిరి బెదిరిపోయింది... కానీ కనీసం తన పాపని తల్చుకోడానికి కూడా తనకి హక్కు లేదా అనిపించి బాధనిపించింది. అప్పుడప్పుడు కలలో తెల్లటి టవల్ మధ్య కళ్లు మూసుకుని గుప్పిట్లు మూసుకుని వున్న పాప అచ్చు గులాబీలా కనిపిస్తుండడంతో

ఒక్కసారి నిద్రలేచి అలా కూర్చుని ఆలోచిస్తూ వుండిపోతుండేది... అన్నీ మర్చిపోడానికి, ముఖ్యంగా పాపని మర్చిపోడానికి చదువు మీద దృష్టి కేంద్రీకరించింది... ఎప్పుడైనా టీవి చూస్తున్నప్పుడు చిన్న పాపలు అడ్వర్టయిజ్‌మెంట్స్‌లో కనిపిస్తే మనసు విలవిల్లాడుతుండేది.

ఆ రోజు ఆదివారం

లాహిరి స్నేహితురాలు లలితని ఆరోజు ఉదయం పెళ్లి కూతుర్ని చేస్తున్నారు. మర్నాడే ఆమె పెళ్లి... లాహిరి ఉదయాన్నే లేచి, లలిత కోసం కొన్న పట్టుచీర, జాకెట్టు, పూలు తీసుకుని లలిత వాళ్లింటికి వెళ్లింది. అయితే ఆమె వెళ్లేటప్పటికి ఆ ఇంట్లో శుభకార్యం జరుగుతోందన్న హడావుడిగానీ, అనవాలుగానీ లేదు. లాహిరి సందేహిస్తూ లోపలికి అడుగుపెట్టింది... ఆమెని చూడగానే లలిత గట్టిగా ఏడుస్తూ వచ్చి లాహిరిని వాటేసుకుంది.

''ఏం జరిగిందే?'' ఆశ్చర్యంగా అడిగింది లాహిరి.

''మా చిన్నన్నయ్య కూతురు ఆముక్తని ఎవరో ఎత్తుకెళ్లారుట... కనిపించడంలేదు'' వెక్కుతూ చెప్పింది.

'' ఎత్తుకెళ్లారా? ఎవరు? ఎందుకు?'' విస్తుపోతూ చూసింది లాహిరి... అదేంటి పాపనెత్తుకుపోవడం ఏంటి? బంగారమో, డబ్బో, ఫ్రిడ్జో, టీవీయో ఎత్తుకుపోతారు... కానీ పాపనెత్తుకుపోడం ఏంటి? ఎవరన్నా చుట్టాలు సరదాగా బైటికి తీసికెళ్లారేమో!''

''కాదు లాహిరీ! రాత్రి నుంచీ కనిపించడంలేదు-- అన్నయ్యా వాళ్లు పోలీసుస్టేషన్ చుట్టూ, పత్రికల ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. మా మావయ్య వాళ్లు, రేడియోస్టేషన్‌కి, దూరదర్శన్‌కీ వెళ్లారు అనౌన్సుమెంటు ఇప్పించడానికి-- రాత్రి నుంచీ మాకు నిద్రలు లేవు, తిండి లేదు.''

''అసలెలా జరిగింది? పాప ఎక్కడుంది?''

''రాత్రి పిల్లలంతా పందిట్లో ఆడుకుంటున్నారు.. మేమంతా మా పనుల్లో మేమున్నాం... ఎవరో ఒకావిడ చాలాసార్లు పందిట్లోకి వచ్చి పిల్లలవైపు చూస్తూ నిలబడిందట... ఎవరోలెమ్మని వీళ్లు పట్టించుకోలేదుట- ఆముక్త అందరిలోకి చిన్నదికదా! మాటిమాటికీ కాళ్లకడ్డం పడుతూ, కిందపడి ఏడుస్తోందని దాన్ని అరుగు మీద కూర్చోబెట్టి నాలుగు బొమ్మలిచ్చి మిగతా

పిల్లలంతా ఆడుకుంటున్నారు... కాస్సేపటికి చూస్తే అముక్త కనిపించలేదు.. పిల్లలంతా ఇంట్లోకి, వాకిట్లోకి తిరుగుతూ అముక్తా, ముక్తా అని పిలుస్తోంటే ఏం జరిగిందాఅని మేమంతా బైటికి వచ్చి అడిగితే అముక్త కనిపించడం లేదన్నారు. ఎక్కడికి వెడుతుంది లెమ్మని అందరం వెతుకుతోంటే మా పక్కింటబ్బాయి, అముక్తని ఎవరో లావుపాటావిడ ఎత్తుకుని తీసుకెడుతోందని, మా చుట్టాలావిడ కాబోలనుకున్నానని చెప్పాడు''.

''మైగాడ్! కానీ, కానీ ఆవిడ ఏం చేసుకుంటుంది పరాయివాళ్ల పాపనెత్తుకెళ్ళి, ఈ రోజుల్లో ఎవరి పిల్లలే వాళ్లకు బరువై పోతోంటే'' అన్నది లాహిరి.

''కాదే పిల్లల్ని ఎత్తుకెళ్లి రెడ్‌లైట్ ఏరియాల్లో అమ్మేస్తారట. లేదంటే కళ్లో, కాళ్లో, తీసేసి వ్యాపారం చేస్తారుట. ఆ మధ్య పేపరులో వచ్చింది చూళ్లేదూ'' కన్నీళ్లు తుడుచుకుంటూ అన్నది లలిత.

లాహిరికి ఒళ్లు ఒక్కసారిగా జలదరించింది... నిజంగానా? భయంగా అడిగింది- '' అవునే అందుకే మాకు చాలా భయంగా వుంది...''

లలిత పెళ్లి తాత్కాలికంగా ఆగిపోయింది.

లాహిరి ఇంటికెళ్లిపోయింది. ఆమె మనసంతా అముక్త, ఆపిల్ల భవిష్యత్తు నిండిపోయింది. ఎలా! పాప దొరుకుతుందా? భగవంతుడా పాప దొరకాలి అనుకుంటూ పడుకుంది... తన పాప గుర్తొచ్చింది... పాపనేం చేసిందో అత్తయ్య... ఎవరికైనా పిల్లలు లేని వాళ్లకిచ్చిందా? అనాధ శరణాలయంలో చేర్పించిందా? పోనీలే అనాధశరణాలయంలో జాగ్రత్తగా చూసుకుంటారు.. అనుకుంది కొంచెం తృప్తిగా. లాహిరి ఆ రోజంతా డల్‌గా వుండటం గమనించి కారణం అడిగింది జ్యోతి.

అముక్తని ఎవరో ఎత్తుకుపోయారని చెప్పింది.

''అసలీ రోజుల్లో ఎవరినీ నమ్మలేకపోతున్నాం... అందరూ పక్కలో బల్లాలే అవుతున్నారు.. ఎవరు పెద్దమనుషులో, ఎవరు చిల్లర మనుషులో అర్థం అవడం లేదు... అయినా పసిపిల్లనలా బైటవదిలేయడం ఏమిటి? బుద్ధుండక్కర్లా'' విసుక్కుంది జ్యోతి.

ఆ రాత్రి లాహిరికి కలలో అందరూ పసిపిల్లలు కనిపించారు. పాకుతూ,

బుల్లి, బుల్లి అడుగులేస్తూ, కాళ్ళూ, చేతులూ ఆడిస్తూ, ఏడుస్తూ కేరింతలు కొడుతూ పాపాయిలు, వందలు, వేలు అలా పుట్టలు, పుట్టలుగా గుంపులు, గుంపులుగా... ఎవరో వచ్చారు... కాళ్లాడిస్తోన్న పాపాయిల కాళ్ళ విరగ్గొడుతున్నారు. కళ్లు పీకేస్తున్నారు, నాలుక కోసేస్తున్నారు.

లాహిరి కెవ్వుమని అరుస్తూ లేచి కూర్చుంది... ఒళ్లంతా చెమటతో తడిసిపోయింది... లోపల గదిలో జ్యోతి, మదన్ తలుపులేసుకుని గాఢనిద్రలో వున్నారు... మంచినీళ్లు తాగి పడుకుంది, కానీ నిద్రపట్టలేదు.. పాపే కళ్ల ముందు కదుల్తోంది... పాపా, పాపా అని కలవరించింది... తెల తెలవారుతుండగా నిద్రపట్టింది.

మెలకువ వచ్చేసరికి మదన్, జ్యోతిల సంభాషణ వినిపిస్తోంది హాల్లోంచి...

జ్యోతి స్వరం – ''బాబోయ్ ఎంత ఘోరం! పసిపిల్లలతో వ్యాపారమా? వీళ్లు మనుషులా? పశువులా? నిన్న లాహిరి చెప్పింది వాళ్ల స్నేహితురాలి అన్నయ్య కూతుర్ని ఎవరో ఎత్తుకెళ్లారని ఇదేం దారుణం వీళ్లకి పిల్లల్లేరూ! అసలు గవర్నమెంటు ఏం చేస్తోంది? ఇలా పిల్లలతో వ్యాపారం చేస్తోంటే, అనాథ శరణాలయాల మీద ఇంక ఎవరికి నమ్మకం వుంటుంది? వీళ్లు చేసేది సమాజసేవా? ఛీ, చెప్పుకోడానికి సిగ్గుచేటు, ఇదేనా మన భాగ్యనగర ఘనత... ఇందుకేనా విదేశీయులు మనల్ని చూసి మురిసిపోతోంది.''

''గవర్నమెంటు ఏం చేస్తుంది జ్యోతీ! ఈ రోజుల్లో నీతి, ధర్మం అనేవి వున్నాయా? సెక్స్ అనేది గుప్పిట్లో మూసి వుంచాలన్న ఇంగితం జ్ఞానం పోయి విచ్చలవిడిగా మారింది, ఆడపిల్లలు ఒళ్లు మరచి తిరగడం, పిల్లల్ని కనడం, దేశంలో అనాథలని తయారుచేయడం, ఇదిగో ఇలాంటి వాళ్లందరికీ పెట్టుబడిలేని వ్యాపారంగా ఆ పిల్లలు ఉపయోగపడుతున్నారు.. ఎవర్నని ఏం లాభం లేదు... ఇవాళ ఉదయాన్నే పసిపిల్లలతో వ్యాపారం అన్న వార్త వినడం మన దురదృష్టం...'' మదన్ అంటున్నాడు.

నిలువెల్లా వణికిపోయింది లాహిరి... ఉప్పెనలా దుఃఖం ముందుకొచ్చింది. దేశంలో అనాథలతోటేగా వీళ్లంతా వ్యాపారం చేసేది, దిక్కులేని పిల్లలేగా వీళ్లందరికీ చులకనగా దొరికింది. అనాథలు తయారవడానికి కారణం ఎవరు?

ఎవరిది ఈ పాపం! నాది.. అవును నాదే.. లహిరీ బిగ్గరగా ఏడవటం మొదలుపెట్టింది.

హాల్లో వున్న జ్యోతి, మదన్ పరుగెత్తుకుని వచ్చారు...

రెండు చేతుల్లో మొహం దాచుకుని, కుప్పలా కూలిపోయి, వెక్కి వెక్కి ఏడుస్తోన్న కూతుర్ని చూసి ఇద్దరూ నిశ్చేష్టులై, శిలల్లా నిలబడిపోయారు.

– ఆంధ్రభూమి దినపత్రిక
జూన్ 2, 9 తేదీల్లో